# సత్యహరిశ్చంద్రుడు

*త్రిశంకు మహారాజు పుత్రుడైన ఈ హరిశ్చంద్రుడు ఆడిన మాట తప్పెడివాడు కాదు. ఇంతటి సత్యవ్రతుడైనవాడు లోకములో మరొకడు లేడు. ఇతని పరిపాలనలో సత్యమే తన లక్ష్యముగా భావించి పాలించెను. ఎట్టి కఠిన సమయములందైననూ అసత్యమునాడెడివాడు కాడు. ఇతని సత్యవ్రతమును పరీక్షింపగోరి విశ్వామిత్రుడు ఒకనాడు రాజును చేరి దానమడుగ, గురుభక్తి, ప్రభుభక్తి యెరిగినవాడగుటచే హరిశ్చంద్రుడు, 'స్వామీ! తమకు నేను దానమిచ్చుట యేమి? ఇదంతా మీది కాదా! రాజ్యమే తమది' అని నోరుజారి ఆడిన లోకమర్యాద మాటలను విశ్వామిత్రుడు ఆధారముగా తీసుకొని, హరిశ్చంద్రా ఇది నిజమా, రాజ్యమంతా నాది అంటివికదా! వప్పుకొందువా అని నిలబెట్టి అడుగుటచే హరిశ్చంద్రుడు మాట తప్పనివాడు కనుక తప్పక ఈ రాజ్యము తమదేనని, మరొకసారి దృఢము చేయగా, తన సంకల్పమునకు యిది ప్రథమ విజయమని విశ్వామిత్రుడు భావించి, అట్లయిన రాజా యిది నాది, అయిననూ నాకు అవసరమొచ్చినప్పుడు తీసుకొందును, నీదగ్గరనే ఉంచుకొనుము. దీనికి కప్పము మాత్రము చెల్లించుచుండిన చాలని వెళ్లిపోయెను. తరువాత తన శిష్యుడైన నక్షత్రకుని పంపి కప్పమును వసూలుచేయమనగా, రాజ్యము విశ్వామిత్రునికిచ్చిన తరువాత, తన వద్ద రాగికాణీ లేదుకదా! కప్పమెట్లుచెల్లించును? అందుకై తన మాటను దక్కించుకొనుటకై నక్షత్రకుడు పెట్టు బాధలకు సహించుకొని రాజ్యమును విడచి, భార్యాబిడ్డలను అమ్మి కొంత బాకీ తీర్చి, మిగిలిన అప్పుకై తనను తానే అమ్ముకొని, కాటికాపరిగా పని చేసెను. రాజ్యభ్రష్టుడై, భార్యాపుత్రవియోగుడై కాటిగాపరిగానున్ననూ, తన సత్యమును కాపాడుచు కఠిన బాధలు నొందుచూ, కడకు కుమారుడు లోహితాస్యుడు పాము కరచి చనిపోగా చంద్రమతి ఆ పిల్లవానిని తీసుకొని శ్మశానమునకు వెళ్లి కాల్చుటకు కాటి సుంకము లేకపోగా హరిశ్చంద్రుడు, ఆమె తన భార్య అనియు, ఆ పిల్లవాడు తమ కొడుకనియు, గమనించి కూడను, సుంకము చెల్లించక కాల్చుటకు వీలులేదని, తన కర్తవ్యకర్మలకెట్టి లోటును రానీయక, కడకు ఆమె మెడనున్న తాళినైననూ సుంకముగా చెల్లించమని కోరగా, చంద్రమతి, తన తాళి భర్తకు తప్ప అన్యులకు కనిపించదను సత్యమెరిగినది కనుక, తాను భర్త అని తెలుసుకొని వారు ముర్వురూ చేరి పడుతున్న విచారమును, గమనించి, విశ్వామిత్రుడు యేతెంచి, 'హరిశ్చంద్రా! నన్ను క్షమింపుము. నీ సత్యమును పరీక్షింపగోరి యిట్లు చేసితిని'. అనుగ్రహించి రాజ్యమునిచ్చెను.*

*ఇంతటి సత్యవ్రతుడు లోకమునెందునూ కానరాలేదని విశ్వామిత్రుడు అతనిని సత్యహరిశ్చంద్రుడని సార్థకనామమిడెను. విశ్వామిత్రుని తపశ్శక్తి కంటె, హరిశ్చంద్రుని సత్యవ్రతమే చాలా గొప్పదని విశ్వామిత్రుడే వప్పుకొనెను. అతని సత్యవ్రతమునకు ఈశ్వరుడు ప్రత్యక్షమై భార్యా, భర్త, బిడ్డను అనుగ్రహించి పోయెను.*

ఆధ్యాత్మిక క్షేత్రమందు విజయమును సాధించగోరిన ప్రతి మానవునకు శీలత్రయములు అతి ప్రధానములు. మొదటిది పవిత్రము. రెండవది సహనము. మూడవది పట్టుదల. ఇవియే శీలత్రయములు. ఎంతటి విద్యావంతుడైనా, ఎంతటి ధనవంతుడైనా, ఎంతటి అధికారియైనా, ఎంతటి శాస్త్రజ్ఞుడైనా, ఎంతటి పండితుడైనా, ఎట్టి పామరుడైనా ఈ శీలత్రయములు లేకుండిన, వాడు కేవలము జీవితములో బ్రతికి కూడను చచ్చినవానితో సమానము అన్నారు. ఎన్ని ఉండికూడను నిరుపయోగము అన్నారు. లోకములో బాహ్యసౌందర్యమును మాత్రమే గుర్తింతురు మానవులు. కాని, భగవంతుడు అంతరతత్త్వమైన ఆత్మతత్త్వమునే అలంకారముగా గుర్తిస్తాడు. శీలము లేనటువంటి జీవితము శిలతో సమానము. దీనికి సత్యము పునాది. సత్యమనగా అసత్యము చెప్పకుండా ఉండటము ఒక్కటే కాదు. సత్యమే తనయొక్క జీవితాధారముగా తీసుకోవాలి. సత్యము ముందు సర్వము త్యాగము చేయాలి. ఈ సత్యమునకు లొంగినటువంటిదే ఈ జగత్తు. సత్యమునకు భయపడియే జగత్తు నడచుచున్నది. సత్యము లేని స్థానములో మానవుడు భయముతో జీవిస్తాడు. సత్యమే మానవునికి అభయము. భయమును దూరముగావించి దైవత్వమును పొందించేటువంటిదే సత్యము. దీనికి బాల్యము నుండియే తగిన కృషి చేయాలి. సత్యమును చెప్పినప్పుడే మనకు ధైర్యము, సాహసము, ఆనందము కూడ లభిస్తుంది. సత్యమును చెప్పటం చేత మనకు రాబోయేటువంటి ఫలితముగాని, ఆదాయముగాని, సుఖముగాని లభించునోలేదో అని భయపడకూడదు. సుఖసంతోష

సదుపాయములు లభించకపోయినప్పటికీ, మనము యేమాత్రమూ వెరవరాదు. సత్యమును మాత్రమే మనము ఆధారము చేసుకోవాలి. భవనమునకు పునాది ఎట్టి ఆధారమో, వృక్షమునకు వేర్లు ఎట్టి ఆధారమో జీవితమునకు సత్యము అట్టి ఆధారము. దీనికి ప్రత్యక్ష ప్రమాణము హరిశ్చంద్రుడే.

ఆడిన మాట తప్పరాదని తనయొక్క జీవితములో కట్టుకున్న భార్యనైనా, కన్న కుమారునైనా కూడను త్యజించి, రాజ్యభ్రష్టుడై, అడవి పాలైపోయి, సత్యము నిమిత్తమై తపస్సులాచరించాడు. కట్టకడపటకి ఆలుబిడ్డలను అమ్ముకున్నాడు. కాని, కట్టవలసిన వడ్డీకి తక్కువ కావటంచేత తానుకూడను అమ్ముడుపోయి కాటికాపరిగా. కాని, ఇట్టి దురవస్థల సమయములందు కూడను తాను యేమాత్రము అసత్యమునకు గురికాలేదు. కుమారుడు లోహితాసుడు మరణించినప్పుడు, భార్య చంద్రమతి శ్మశానమునకు తీసుకొని వచ్చినది కుమారుని. చంద్రమతి తన భార్యయైనను, లోహితాసుడు తన కుమారుడని తెలిసికూడను తన కర్తవ్యము, ఇక్కడే ధర్మము, తన కర్తవ్యము సుంకము చెల్లించక దహన క్రియలు చేయటానికి అంగీకరించలేదు. నేడు కాటికాపరి కర్తవ్యమును నేను నిర్వర్తించాలనే ధర్మమును మాత్రమే తాను ఆధారము చేసుకున్నాడు. ఇలాంటి కఠినమైన సమస్యలయందుగాని, కఠినమైన పరిస్థితులయందుగాని సత్యమును యేమాత్రము విసర్జించక, తనయొక్క జీవితమునకు రెండు రెక్కలుగా, రెండు చక్రములుగా భావించి, జీవించి ఆదర్శవంతమైన జీవితాన్ని అందిస్తూవచ్చాడు హరిశ్చంద్రుడు.

మహా చక్రవర్తి అయిన హరిశ్చంద్రుడుకూడను, దురదృష్టశాత్తు శ్మశానములో కాటికాపరిగా నిల్చాడు. తాను తీవ్రవైరాగ్యము వైపునే ప్రయాణిస్తూ వెళ్ళాడు. ఒకనాడు సాయంకాలము ఒక శ్రీమంతుని దేహము బంధువులు, మిత్రులు అందరూ శ్మశానమునకు తీసుకొని వచ్చారు. కాష్టముపై పెట్టారు. నిప్పు పెట్టారు. ఎవరిపాటుకి వారు వెళ్ళారు. దేహముయొక్క స్వభావము ప్రకారము కొంతసేపు వెన్నెముకకు వేడి తగిలేటప్పటకి కొంచెము లేస్తుంది దేహము. ఆ దేహము లేవకూడదని రొమ్ముపైన ఒక పెద్ద కఱ్ఱను కూడా వుంచుతారు. బంధువులు, మిత్రులు ఎవ్వరూ లేరు అక్కడ. ఒక్క హరిశ్చంద్రుడు మాత్రమే ఉన్నాడు. కట్టెలంతా వేస్తున్నాడు పాపం. ఒక్క క్షణములో ఆ దేహము లేచి కూర్చున్నట్లుగా అయింది. హరిశ్చంద్రుడు ఆశ్చర్యపడ్డాడు. ఎమి ప్రాణము వచ్చిందా అని దగ్గరకు వెళ్ళి చూస్తుంటే పడిపోయింది. అప్పుడు అనుకుంటున్నాడు,

మాయామేయ జగంబె నిత్యమని సంభావించి మోహంబునన్
నా యిల్లాలు నా కుమారుడంచు ప్రాణంబుండినందాక ఎం
తోయల్లాడిన ఈ శరీరమిపుడిందుం కట్టెలన్‌గాలుచో
ఆ యిల్లాలును రాదు కొమరుడు తోడై రాదు తప్పింపగన్.

అని చాలా బాధపడ్డాడు. మహరాజుగా వుంటుండి, ఏకచ్ఛత్రాధిపత్యము ఏలి, అంతమంది బంధువులతో, మిత్రులతో కూడినటువంటి ఈ దేహము ఈ కట్టెలతో కాలుతున్న సమయములో యిల్లాలైనా, కుమారుడైనా వెంట రాకపోయినారుకదా యని భావించి తన వైరాగ్యము మరింత తీవ్ర స్థితికి తీసుకువెళ్ళాడు.